# మనీషిగా మారిన మనిషి

పెద్ద కథ

కథా నిలయం
శ్రీకాకుళం

(గత సంచిక తరువాయి)

కొద్ది రోజులుగా సాగర్‌లో వచ్చిన మార్పు ఆరతిని కలవరపెట్టసాగింది. ఇది వరకులా తనతో మాట్లాడటం లేదు. టూకీగా తను అడిగిన దానికి జవాబు చెప్పి తన్ని తప్పించుకుని తిరుగుతున్నాడు. అతని మౌనానికి కారణం అర్థం కావటం లేదు. చెల్లెల్నె అడగాలని ఆ రోజు సాయంత్రం ఆఫీసునుంచే సరాసరి బజారు కెళ్ళి పువ్వులు, పళ్ళు కొని భారతి దగ్గరికి వెళ్ళింది. వీధి తలుపు చేరేసి వుంది. భారతి చాలా కోపంగానే కేకలు వేస్తోంది. సాగర్ నెమ్మదిగా ఏదో జవాబిస్తున్నాడు.



కందుకూరి
వెంకట మహాలక్ష్మి

## ఎందుకట్టా?

‘వీర్ దార్’ సినిమాలో షారూక్‌ఖాన్ హీరోగా చేస్తున్నాడు. హీరోయిన్లుగా రాణీ ముఖర్జీ, ప్రీతిజింతాలు చేస్తున్నా రాణీ ముఖర్జీకి పోస్టర్లలో ఎక్కడా ప్రాధాన్యం ఉన్నట్లు కనిపించడం లేదు. పోస్టర్లు చూసినవాళ్ళకి రాణీముఖర్జీ హీరోయిన్‌గా ఉన్నట్లుగా కూడా తెలియడం లేదట! దాంతో నిర్మాతలపైన రాణీముఖర్జీ అలక పూనిందని బోగట్టా! ఇంతకీ రాణీ ఫోటో పోస్టర్లలో కనిపించకపోవడానికి కారణమేమై ఉంటుందో!?



“అసలు నన్నెందుకు పెళ్ళాడారు? మీకు మా అక్కమీద ప్రేముంటే దాన్నే కట్టుకోవలసింది. పేరుకి నేను పెళ్ళాన్ని, ప్రేమ కలాపాలు మా అక్క తోటీనా? మీ ఆఫీసులో జనం ఎంత చెడ్డగా మీ ఇద్దరి గురించి చెప్పుకుంటున్నారో ఒకసారి తెల్సుకోండి. మీరంత దయదల్చి పెళ్ళాడకపోతే నేనేం కన్యగా వుండిపోయేదాన్నేం కాదు. నాకు తగ్గవాడు నాకూ దొరికేవాడు.” అంటూ గట్టిగానే అరుస్తోంది భారతి.

తన చెవుల్తో వింటున్న మాటల్ని తనే నమ్మలేకపోయింది ఆరతి. “పద్దెనిమిదేళ్ళపాటు కలిసి పెరిగాము. నా గురించి అంతా తెలిసిన భారతే యింత నీచంగా ఊహించిందా?” అని ఆలోచిస్తూన్నకొద్దీ ఆమె మెదడులోని నరాలు బాధతో మెలికలు తిరిగిపోసాగాయి. గిర్రున వెనక్కి తిరిగి ఇంటికి వెళ్ళిపోయింది. సాగర్ మౌనానికి కారణం అర్థమైంది. రాత్రల్లా ఆలోచించింది. “నా వల్ల వారి మధ్య ఏ కలతలూ రాకూడదు. వారు హాయిగా వుండాలి” అనుకుంది. మర్నాడు ఆఫీసులో సాగర్ని కలిసి వెంటనే ఈ వూరి నుంచి బదిలీ చేయించుకోమని చెప్పింది. సాగర్ ఆరతి మాటలకి తెల్లబోయాడు. ఆరతికి తమ గొడవంతా తెలిసిపోయిందని గ్రహించి ఏమీ మాట్లాడకుండా తలవంచుకుని అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

అంతటితో అతన్ని వదలక రోజూ అతన్ని ఆ విషయమై పోరసాగింది. అతని చేత బదిలీకి అప్లికేషన్ పెట్టించి ఆ పేపర్లు తనే పైకి పంపే ఏర్పాట్లు కూడా చేసింది.

ఆఫీసులో సాగర్ ఆరతులు ప్రేమించుకోవడం, కలిసి తిరగడం చూసిన వాళ్ళంతా అది వారి పెళ్ళితో ముగుస్తుందనుకున్నారు. కానీ సాగర్ ఆరతి చెల్లెల్ని పెళ్ళిచేసుకోవడం, ఆ తరవాత కూడా వాళ్ళు వదినా, మరదీ బాంధవ్యంతో ఏ పొరపొచ్చాలూ లేకుండా కబుర్లు చెప్పుకోవడం వాళ్ళందరికీ వింతగా, ఆశ్చర్యంగా వుంది.

తమకి లొంగని ఆరతి గురించి దుష్ప్రచారం చెయ్యడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్న కొందరు తమతమ భార్యల చేత పెళ్ళయిన సాగర్ ఆరతితో యిదివరకులా ఆఫీసులో ప్రేమ కలాపాలాడుతున్నాడనీ, వాళ్ళిద్దరూ ఏమీ మారలేదనీ భారతికి చెప్పించి వారి మధ్య కలతన్ని లేవదీయసాగారు. భారతీ, విషయాన్ని నమ్మి సాగర్‌తో తగువు పెట్టుకునేది. ఆ దంపతుల మధ్య గొడవలు, ఆరతి మీద అనుమానం రోజురోజుకీ అధికమవసాగాయి. దాంతో ఇంటికొచ్చే అక్కని సూటీపోటీ మాటలతో అవమానపరిచేది. సాగర్ కోసమే తనింటికి వస్తోందని నిందించేది. చెల్లెలి దెప్పులు, ప్రవర్తన ఆరతిని చాలా నొప్పించేవి. ఈ కొత్త రకం బాధతో యింత వరకూ వున్న కాస్త మనస్థిమితం కూడా లేకుండా పోయింది. ఇంట్లో తండ్రి రోగం, లేమితనం బాధిస్తే ఆఫీసులో కిరాతకులు లాంటి తోటి ఉద్యోగులూ, రావణాసురుడి వంటి ఆఫీసరూ బాధించేవారు. ఇదికాక ములుకుల్లాంటి మాటలతో చెల్లెలు అవమానపర్చేది. వీటన్నింటితో జీవితం మీదే విరక్తి పుట్టి “ఛీ.. ఎందుకీ పాడు బ్రతుకు” అనుకునేది. కానీ తమ్ముడూ, తండ్రికోసం తను జీవచ్ఛవంలా బ్రతక్క తప్పదనుకునేది. అందుకే ఇటువంటి పరిస్థితుల్లో భారతి, భర్త ఈ వూరినుంచి వెళ్ళిపోవడమే వారికీ, తనకీ శ్రేయస్కరం అనుకుంది. వాళ్ళు ఊరినుంచి వెళ్ళిపోతే కనీసం ఒకరి దృష్టిలోనన్నా తన అల్పత్వం పోతుందని ఆశించింది.

ఆమె ప్రయత్నం ఫలించి సాగర్‌కి విజయవాడకి బదిలీ అయి వెళ్ళిపోయారు.

సాగర్ ఎదురుగా విచ్చలవిడిగా నోరు పారేసుకునే అవకాశంలేని కీచకులందరికీ మంచి స్వేచ్ఛ లభించింది.

“సాగర్‌గాడితో లవ్ నడిపి పెళ్ళి చేసుకోలేదేంటిరా?” అని ఒకడంటే “పెళ్లాడితే ఒక్కడే అవుతాడు కదురా” అని మరొకడు. “రోజుకొకడైతే వ్యాపారం బాగుంటుంది. నెలకి వేలకి వేలొస్తాయి కదా!” అని మరో పెద్ద మనిషి. “మన్ని కూడా...” అంటూ పళ్ళికిలించే వ్యక్తి మరొకడూ. “ఆఫీసులో సమవుజ్జీలమేగాని బైట ఆమెతో... సమానమెలాగవుతాం?” అనొకడు. “అసలు రేటెంతో తెలుసుకుంటే...” అంటూ నలుగురు బిడ్డల తండ్రీ – ఇలా ఆమె చుట్టూ కూర్చుని బాణాల్లాంటి మాటలతో హింసిస్తుంటే తలొంచుకుని పనిచేసుకుంటూ ఏకాకిలా కూర్చునే ఆరతి మనసు వెయ్యి విధాల నలిగిపోయేది.

లంచ్ టైమయింది. లేచి టీ తాగుదామని వెళ్ళబోతున్న ఆరతి దగ్గరికి బంట్రోతు రామన్న వచ్చి “ఆఫీసర్‌గారు రమ్మంటున్నారమ్మా!” అన్నాడు.

భయపడుతూనే ఆరతి గదిలోకి వెళ్లింది. బల్లమీదున్న ఫైలు ఆమెకిచ్చి, “ఈ ఫైలులోని పేపర్లు సాయంకాలానికి టైపు చేసి తీసుకురా! ఇవి సాయంకాలం డిస్‌పాచ్ చెయ్యాలి. అర్జంట్” అని అందించాడు.

ఫైలు తీసుకుని బైటికొచ్చిన ఆరతి ఆ ఫైలు తెరిచి కాగితాలు చూసింది. కళ్ళు తిరిగిపోయాయి. “ఇద్దరు చెయ్యాల్సిన పని ఒక్కర్తినే సాయంకాలానికి పూర్తి చేసి ఆఫీసర్ చేత సంతకాలు పెట్టించగలనా?” అనుకుంటూ తన టేబిల్ దగ్గరికి వెళ్ళి సొరుగులో పెట్టి క్రిందికెళ్ళింది.

టీ తాగి వచ్చిన ఆరతి ఉదయం ఇచ్చిన పేపర్లు టైప్ చెయ్యడం అయ్యాక ఆఫీసర్ యిచ్చిన ఫైలు కోసం సొరుగు తెరిచింది. తను

పెట్టిన జాగాలో ఫైలు కనబడలేదు. మళ్ళీ వెతికింది. కంగారుగా అటూ, ఇటూ చూసింది– ఎక్కడా కనబడలేదు. ఆఫీసులో జనం ఆమెవైపు వింతగా చూడసాగారు. చుట్టూవున్న అందర్నీ అడిగింది. తెలీదన్నారు. "ఆఫీసర్ రూంలో మర్చిపోయానేమో!" అనుకుంటూ అతని గదిలోకి వెళ్ళి అడిగింది. "నీతోనే తీసుకెళ్ళిపోయావు. ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రానికి అది రెడీ అయితీరవలసిందే!" అన్నాడు ఖచ్చితంగా. దడదడలాడే గుండెలతో మళ్ళీ తన సీటు వద్దకొచ్చి సొరుగులోని పేపర్లన్నీ తీసి వెదికింది. బీరువా తీసి వెదికింది. అక్కడా లేదు. గాబరా ఎక్కువయింది. డిసెంబరు నెల అయినా చమటపట్టి వళ్ళంతా తడిసిపోయింది. బుర్ర రాయిలా అయిపోయింది. కర్తవ్యం తోచని ఆరతి స్తబ్ధులా నిలబడిపోయింది. వెర్రిదానిలా చూస్తూ 'ఎలా పోయిందీ? ఏం చెయ్యాలిప్పుడు? అంటూ తనలో తనే పిచ్చిదానిలా ప్రశ్నించుకోసాగింది. గడియారం వైపు చూసింది. టైము నాలుగు కావస్తోంది. అంటే మరో గంటన్నరలో ఫైలు రెడీ చేసి సంతకాలు పెట్టించాలన్న మాట. అవుతుందా? అయినా ఫైలులేందే!? నెమ్మదిగా మేనేజర్ గదిలో కెళ్ళి విషయం చెప్పిన ఆరతి మీద విరుచుకు పడ్డాడు. "ఇంత నిర్లక్ష్యంగా వుంటే ఉద్యోగం ఊడుతుంది. వెతికి, పని పూర్తి చేసి ఎంత రాత్రయినా, ఇంటికొచ్చయినా సంతకాలు చేయించుకోవాలి." అని ఖచ్చితంగా చెప్పేసి వెళ్ళమన్నాడు.

నీరసంగా వచ్చి కుర్చీలో కూలబడిపోయింది. నాకీ ఉద్యోగంతో ఋణం తీరిపోయిందనుకుంది. బరువెక్కిన గుండెలతో బాత్ రూంలోకెళ్ళి ముఖం కడుక్కుని కేన్టీన్ వైపు నడిచింది. కాస్త కాఫీ తాగి తిరిగి వచ్చి మళ్ళీ సొరుగు లాగి చూసింది ఆశ చావని ఆరతి. ఆశ్చర్యం అది తను పెట్టిన చోటే వుంది. నమ్మలేనట్లు కళ్ళు నులుముకుని మళ్ళీ చూసింది. అది ఆఫీసర్ యిచ్చిన ఫైలే! ఆనందంతోపాటు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. గబగబా ఫైలు తెరిచి టైప్ చెయ్యడం ప్రారంభించింది.

టైము ఆరున్నరయింది. బంట్రోతు తాళాల గుత్తితో ఎదురుగా నిలబడ్డాడు. "అమ్మా అంతా వెళ్ళిపోయారు. తమరూ వెళ్తే నేను తాళాలేసుకుని ఇంటికి పోతాను" అన్నాడు. అతని వైపు చూసి లేచి ఫైలు తీసుకుని లేచింది.

ఇంటికెళ్తే పని పూర్తిచెయ్యడం కుదరదని తెలుసు. తండ్రి మూలుగు, అతని చాకిరీ, ఇంటి పనితో తీరదని ఆఫీసులోనే పూర్తి చెయ్యాలనుకున్న ఆరతికి బంట్రోతు మాటలతో లేవక తప్పలేదు.

ఇంటికెళ్ళి తొందర తొందరగా పనులన్నీ పూర్తి చేసి, ఫైలు ముందేసుకుని కూర్చుంది.



## అలవాట్లు

నాగరికత
పుణ్యమా అని
నాకిప్పుడు
బంకర్లలో దాక్కోవడం
మారణకాండను చూస్తూ
నడుచుకుపోవడం
అలవాటయింది!
శరణార్థిగా పారిపోగలను
ఖైదీగా చిత్రహింసలు
భరించగలను!
ఆకలితో అలమటించగలను
ఇంకా మాట్లాడితే
వరదలో కొట్టుకుపోతూ
బ్రతికేయగలను....

– శైలూషి

రెండు గంటల్లో పని పూర్తి చేసింది. ఇక మేనేజర్ చేత సంతకాలు పెట్టించాలి. గడియారం వైపు చూసింది. తొమ్మిదిన్నర దాటింది. తమ్ముడు అర్ధ సంవత్సరపు పరీక్షలకి దీక్షగా చదువుతున్నాడు. తండ్రి నిద్రపోతున్నాడు. నెమ్మదిగా వెళ్ళి "ఒరేయ్ మాధవ్! కాస్త నాకు తోడు రారా! ఓ గంటలో తిరిగొచ్చేద్దాం. మా ఆఫీసరింటికెళ్ళి ఈ పేపర్లమీద సంతకాలెట్టించుకుని వచ్చెయ్యాలి. అర్జంటు పేపర్లు. రేపు ఉదయమే వెళ్ళిపోవాలిట" అంది.

"అబ్బా నువ్వెళ్ళి రావే అక్కా! నాకు పరీక్షలు. బాగా చదవకపోతే మంచి మార్కులు రావు. క్లాసు తెచ్చుకోకపోతే ఎందులో సీటు రాదు. అయినా ఏమంత రాత్రయిందనీ? రోడ్డు మీద జనాలు తెగతిరుగుతున్నారు. అయినా యింత పిరికిదానివి ఉద్యోగం ఎలా చేస్తున్నావు?" అంటూ మళ్ళీ పుస్తకంలో తల దూర్చాడు.

ఇంకవాడికేం చెప్పి ప్రయోజనం లేదని గ్రహించి ఫైలు తీసుకుని బయలుదేరింది.

ఆరతి కోసమే ఎదురు చూస్తున్న ఆఫీసర్ ఆమెని చూడగానే ఆప్యాయంగా పలకరించి కుర్చీ చూపించాడు. అన్ని కాగితాలమీద సంతకాలు చేసి ఫైలు అందించాడు. లేచి ఫైలు తీసుకోబోయిన ఆమె చేతిని పట్టుకుని మీదకి లాక్కుని వాటేసుకున్న ఆఫీసర్ నెత్తిమీద బలంగా ఒక్క గుద్దుగుద్దాడు అతను. "నీకు అప్పా, చెల్లెళ్లూ లేరట్రా నా కొడకా పనిమీదొచ్చిన ఆడకూతుర్ని అల్లరిపెడతావట్రా?" అంటూ ఆరతి చెయ్యి పట్టుకుని నడిపించుకుని వెళ్ళిపోయాడతను.

ఎదురు చూడని ఈ సంఘటనకి అవాక్కయి నిలబడిపోయిన ఆఫీసర్ తేరుకుని "ఫలితం అనుభవిస్తుందిలే!" అనుకుని కంగారులో బల్లమీదొదిలేసిన ఫైలు తీసి దాచేశాడు.

రిక్షా అతను ఆపద సమయంలో తండ్రిలా ఆదుకున్నా ఆ తరవాత తనకి జరగబోయే అపకారమేమిటో ఊహించలేనంత మూర్ఖురాలు కాదు ఆరతి. రిక్షా ఇంటివైపు వెళ్తోంది.

టైము పన్నెండవుతోంది. రిక్షా జోరుగా తొక్కుతున్నాడు. బీట్ కానిస్టేబుల్ విజిల్ వినబడుతోంది. విజిల్ దగ్గరవగానే రిక్షా వేగాన్ని కాస్త తగ్గించాడు. కానిస్టేబుల్ వెనకనుంచి వేసిన కేకకి రిక్షా ఆపక తప్పలేదు.

"ఎవత్తిరా అదీ!" అంటూ రిక్షా దగ్గరికి వచ్చి రిక్షాలోకి వంగి చూసాడు. "ఎవడి కప్పగించి తీసుకొస్తున్నావురోయ్! ఈ అర్ధరాత్రి తిరుగుతూ, యిలాంటి బేరాలే కదుతున్నావా? సంపాదన బాగానే వుందన్నమాట. ఇదిగో ఈ నోటు తీసుకుని ఆ సందులోకోసారి తీసుకురా! ఓ గంటలో తిరిగొచ్చేస్తుందిలే" అంటూ ఓ పది

రూపాయిల నోటుని రిక్షావాడికివ్వబోతున్న కానిస్టేబుల్‌ని చూసి వణికి పోసాగింది ఆరతి. ఏం తోచని ఆరతి "ఈ గండాన్నెలాగైనా తప్పించు భగవాన్!" అంటూ మనసులోనే ప్రార్థించుకోసాగింది.

"మనకీ అమ్మ, అప్ప, చెల్లెళ్లు వున్నారు బాబూ! అసలే కష్టాల్లో వున్న ఆడకూతురు. ఈ బిడ్డని యింటికి తీసుకెళ్తున్నాను. మీకు కావాలంటే అలాంటోళ్ళు బోల్డు మంది వున్నారు. మా తోవని మమ్మల్ని పోనియ్యండి బాబూ!" అంటూ జోరుగా రిక్షా తీసుకెళ్ళిపోతున్న రిక్షా అతనికి మనస్సులోనే నమస్కరించింది ఆరతి.

"నీ సంగతి చూస్తారా! మాతో వైరం మీకెంత చేటో రేపే తేల్చేస్తా!'. అంటూ తిడుతున్న కానిస్టేబుల్ తిట్లు, మాటలూ ఆరతికీ, రిక్షా అతనికీ వినపడకపోలేదు. తనకే కాకుండా తన్ని రక్షించినవారికి కూడా ఆపద రాబోతుందని బాధపడింది ఆరతి.


అర్జంటుగా డిస్పాచ్ చెయ్యవలసిన ఫైలు, నిర్లక్ష్యంగా పోగొట్టిందనీ, ఆఫీసులో కూడా పని సరిగ్గా చెయ్యటం లేదనీ పైకి రిపోర్టు రాసి ఆరతి ఉద్యోగాన్ని పీకించేశాడు ఆరతి ఊహించినట్లే.

చెయ్యగలిగిందేమీ లేదు. ఆఫీసర్‌ని తిరస్కరించిన దానికి ఫలితం అనుభవించక తప్పదని తెలుసు. తమ్ముడే తోడుగా వచ్చి వుంటే ఆ సంఘటన జరిగేది కాదు. ఆ రోజుకి ఆ గండం గట్టెక్కేది. తమ్ముడు రాకపోవడంతో రిక్షావాడిని తనే లోపలికి రమ్మంది. తన్నెవరు అర్థం చేసుకుని ఆదుకుంటున్నారు? ఎవరి స్వార్థం వారిది. పూర్తిగా నన్నర్థం చేసుకున్నది సాగర్ ఒక్కడే! కానీ యిప్పుడు తనకి అతనూ పరాయివాడే! నాన్నకి తమ్ముడి చదువుగురించి బెంగ. తమ్ముడికి యింకా పై చదువులు చదవాలన్న ఆలోచన. మరి నా గురించి ఎవరాలోచిస్తున్నారు? ఇంట్లో ఓ రకం, ఆఫీసులో మరోరకం. ఆఖరికి ఉన్న ఉద్యోగం కూడా వూడింది. ఇప్పుడు తమ గతేమిటి? ఉద్యోగం పోయిందని ఖర్చులు తగ్గవు. ఇల్లు గడవాలి, తమ్ముడి చదువు, నాన్న మందులు. ఇప్పుడీ విషయం నాన్నకీ, మాధవ్‌కీ ఎలా చెప్పాలి! అయినా ఏ తండ్రీ, తమ్ముడూ మాత్రం తప్పంటారు? ఆ కిరాతకుడి బారి నుంచి తప్పించుకున్నందుకు సంతోషిస్తారేగానీ ఉద్యోగం పోయిందనీ బాధపడరు." అనుకుంది.

విషయమంతా విన్నతండ్రీ, తమ్ముడూ ఆరతివైపు షాకయినట్లుగా చూసారు. కొద్ది సేపటి తరవాత తండ్రి మాధవ్ నుద్దేశించి "ఒరేయ్! నువ్వయినా వెంట వెళ్ళవలసిందిరా!" అన్నాడు. దాంతో తోక తొక్కిన త్రాచులా లేచిన మాధవ్ "అయినా రిక్షావాడిచేత ఆఫీసర్‌ని కొట్టించడం ఏమిటి? కాస్తయినా ముందాలోచన వుండక్కర్లేదా? పైగా నేనేదో తప్పు చేసినట్లు నన్ను నిందిస్తారేమిటి?" అన్నాడు. "అవునమ్మా! కాస్త సాంతంగా ఆలోచించి ఏ పనయినా చెయ్యాలి, తొందరపడితే ఫలిత మిలాగే వుంటుంది" అన్న తండ్రి మాటలకి ఆరతి స్థాణువులా నిలబడిపోయింది. "ఏమిటి నాన్న, మాధవ్‌ల ఉద్దేశ్యం? సాంతంగా ఆలోచించి చెయ్యాలంటే?? తమ బీదరికాన్ని గుర్తు చేసుకుని ఆఫీసర్ చెప్పినట్లు వినమనా? లేక నెమ్మదిగా నచ్చజెప్పితే తన్ని వదిలేస్తాడనా? అర్ధరాత్రి వేళ ఒంటరిగా వున్నా అతని బారి నుంచి తప్పించుకుని ఎలా రాగలిగేది? ఆఫీసులో ఫైలు దాచేసి దాని కోసమే యింటికి పిలిపించుకున్న ఆఫీసర్ మంచి మాటలకి తన్ని వదిలేస్తాడా? ఎన్నాళ్ళ నుంచో ఎదురు చూసి పన్నిన వల అందులో పడ్డ తను మాటలతో ఎలా తప్పించుకోగలిగేది? వీళ్ళ అభిప్రాయమేమిటి? నా యందు సానుభూతి కనపర్చటం లేదు సరికదా, వారి భవిష్యత్‌లు దెబ్బతింటాయని బాధపడుతూ, తప్పంతా నాదే అని నిందిస్తున్నారేమిటి? ఎంత స్వార్థపరులు! తన గురించి ఆలోచించని తండ్రీ, తమ్ముడూ తనకి రక్తసంబంధీకులా? అక్కకీ, తన భర్తకీ రంకు కట్టిన చెల్లెలు తనకి రక్తసంబంధీకురాలా? తను వీళ్ళందరి కోసం చీమూ, రక్తం ఓడ్చి పాటుపడుతున్న దాని ఫలితం యిదా? కనీసం తన్ని చూసి జాలిపడే దిక్కులేదు. తన కష్టసుఖాలడిగి ఓదార్చేవారు లేరేయింట్లో. ఎందుకీ బ్రతుకు? గాడిదలా ఎదుటివారి బరువుని మోస్తూ పోవడమే తన జీవిత ధ్యేయమా?! తన సుఖ, సంతోషాలు, కోరికలూ అన్నీ తనలోనే సమాధి కావాలన్నమాట! నాకూ, ఇల్లూ, సంసారం కావాలనిపిస్తుందని ఏనాడన్నా తండ్రి ఆలోచించాడా? తల్లి లేని పిల్లల్ని తండ్రే తల్లయి ఆదుకోవాలి. అలాంటిది ఏనాడూ కనీసం తండ్రిగా నయినా తన గురించి ఆలోచించాడా? ముగ్గురు బిడ్డల్ని సమానంగా చూడలేని తండ్రీ ఒక తండ్రేనా? ఎందుకీ భేద బుద్ధి?" అని ఆలోచిస్తూ బరువెక్కిన గుండెలతో అక్కడినుంచి వెళ్ళిపోయింది ఆరతి.

కాలచక్రం తనకి ఎవరి కష్టసుఖాలతోటీ నిమిత్తంలేదంటూ గిర్రున తిరిగిపోతోంది. ఆరతి తండ్రి పి.ఎఫ్.డబ్బుతీసి ఇల్లు నడుపుతోంది. అసలు తరుగుతోందన్న బాధతో తండ్రి ఏదో వంకపెట్టి సణగడం ప్రారంభించాడు. తమ్ముడు తన ఖర్చులు ఏ మాత్రం తగ్గించుకునేవాడు కాదు. ఎంత ప్రయత్నించినా ఆరతికి ఉద్యోగం దొరకటం లేదు. ఆరతి పరిస్థితి రోజు రోజుకీ దుర్భరంగా తయారవుతోంది. ఆ ఉద్యోగం పోవడానికి తనే కారణమనీ, వెళ్ళి క్షమార్పణ చెప్పుకుంటే యిస్తాడనీ రోజూ తండ్రి సణుగుతోంటే భరించలేక, మళ్ళీ వెళ్ళి క్షమార్పణ చెప్పుకోలేక సతమతం అయ్యేది.

ఖర్చు మీద ఖర్చులొస్తాయన్నట్లు భారతికి ఏడవనెల రాగానే పురిటికి తీసుకొచ్చి దింపి వెళ్ళాడు సాగర్. భారతి ఉత్తరాల ద్వారా ఆ యింటి పరిస్థితి తెలుసుకున్నాడు సాగర్. అభిమానవతి, పౌరుషవంతురాలు అయిన ఆరతి డబ్బు పంపినా తీసుకోదనీ తెలిసిన



సాగర్ భార్యపేర నెలనెలా డబ్బు పంపి ఇంటికి సహాయపడమని రాసేవాడు. భారతి తన అవసరాలకి వాడుకుని మిగిలింది దాచుకునేది. పౌరుషవంతురాలైన ఆరతి ఎప్పుడూ చెల్లెల్ని చెయ్యిజాపి అడిగేది కాదు.

భారతికి నెలలు నిండగానే పురిటికి డబ్బు కావాలని చేతినున్న గాజుల జత తాకట్టు పెట్టి డబ్బు తీసుకొచ్చింది. భారతిని నర్సింగ్ హోంలో చేర్చిన మర్నాడే కొడుకు పుట్టాడు. అనుకోకుండా ఆఫీసు పనిమీద సాగర్ కూడా వచ్చాడు. సాయింత్రం ఆసుపత్రికి చంటిబిడ్డని చూడటానికి వెళ్ళి సాగర్, ఆరతుల్ని అనుమానంగా చూస్తూ ముఖం తిప్పేసుకుంది భారతి. కొడుకు పుట్టాడన్న ఆనందం ఆమెలో లేదు సరికదా అక్క కోసమే యిటువంటి సమయంలో భర్త వచ్చాడన్న అనుమానంతో తన్నుతాను హింసించుకోసాగింది. ఆమె బాధని గ్రహించిన ఆరతి మూడవరోజే ఆమెని యింటికి తీసుకొచ్చేసింది. కోపంతో సరిగ్గా తిండి తినక, అపత్యం చేసి, చెప్పిన మాట వినక, నీళ్ళల్లో తిరిగి, యిష్టమొచ్చినట్లు ప్రవర్తించేది. ఆరతి ఏం చెప్పబోయినా విరుచుకు పడి నానా మాటలూ ఆడేది.

సాయంత్రం భారతికి జ్వరం వచ్చింది. చలీ, వణుకూ రాసాగింది. రాత్రికి జ్వర తీవ్రత ఎక్కు వయి కాళ్ళూ, చేతులూ కొట్టుకోసాగాయి. పురుడు పోసిన డాక్టర్నే పిల్చింది. ఆమె చూసి వాతం కమ్మిందని వెంటనే పెద్ద డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళమని చెప్పివెళ్ళిపోయింది. సాగర్ వెళ్ళిపోయాడు. మాధవ్ ఇంటి దగ్గర సరిగ్గా చదువు సాగటంలేదని స్నేహితుడి గదికి వెళ్ళాడు. దిక్కుతోచని ఆరతి చెల్లెల్ని టాక్సీలో ఎక్కించుకుని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళింది. డాక్టర్ ఇంజక్షన్లు యిచ్చి తెల్లారేసరికి కోలుకు నేలా చేసాడు. నాలుగైదు రోజులు ఆసుపత్రిలో వుంచుకుని ఇంజక్షన్లు యివ్వాలనీ చెప్పాడు. ఇంట్లో తండ్రికి, ఆసుపత్రిలో చెల్లెలికి, పిల్లాడికీ చాకిరీ చెయ్యలేక అలిసిపోతున్న ఆరతి సాగర్‌కి రాసి రమ్మనాలనుకుంది. కానీ చెల్లెలి దెప్పులు, సాధింపులేకాకుండా, ఈ పరిస్థితి తెచ్చుకోవడానికి కారణం క్రితంసారి సాగర్ రావడమే! అని గుర్తొచ్చి ఆ ఆలోచననే విరమించుకుంది. లేని ఓపిక తెచ్చుకుని విశ్రాంతి లేకుండా చాకిరీ చేస్తున్నా మాధవ్ తనకేమీ పట్టనట్లు తన పుస్తకాలతో కుస్తీపడుతూ కూర్చునేవాడు. పిసరంత లోటు జరిగితే తండ్రి "నీ ప్రాణానికి శనిగాడినమ్మా! నా ప్రాణమన్నాపోతే బాగుండును. నువ్వున్నా సుఖపడుదువు. అశక్తుడిని, ఒకరిమీద ఆధారపడే నాలాంటి వాళ్ళు బ్రతక్కూడదమ్మా!" అంటూ సమ్మెటపోటుల్లాంటి మాటల్ని నెమ్మదిగా అనేవాడు. ఇక మాధవ్ సరేసరి. లక్షాధికార్ల బిడ్డలతో పోల్చుకుని తన్నితాను కించపరుచుకుంటూ బాధపడేవాడే తప్ప పరిస్థితుల్ని ఏమాత్రం అర్థం చేసుకునేవాడు కాదు.

గాజులు తాకట్టు పెట్టి తెచ్చిన సొమ్ములో రెండొంతులు పురిటికి, ఇంటి ఖర్చుకి అయిపోయింది. ఇప్పుడు చెల్లెలి రోగానికి ఎంతివ్వాలో! అమ్ముదామన్నా ఏమీ లేదు అనుకుంది.

## ప్రేమపక్షులు!

**ఆ**ఫ్తాబ్, షమితాశెట్టిల ప్రేమ కథలు బాలీవుడ్‌లో స్వైరవిహారం చేస్తున్నాయి. చాలాకాలం నుంచి వీరు చాటుమాటుగా కలుసుకుంటున్నా, ఇప్పుడు మాత్రం బహి



రంగంగానే 'మేమిద్దరం హద్దులు దాటని స్నేహితుల'మంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. తనలా కాకూడదని శిల్పాశెట్టి షమితాకి అన్ని జాగ్రత్తలూ చెబుతోందట. అయినా షమితా మాట వింటేగా. పాపం! సినిమాలెలాగూ లేవుగా! ఇలా టైంపాస్ చేస్తుందేమో!

డిస్చార్జి చేసిన చెల్లెల్ని బాబుని యింటికి తీసుకొచ్చి, ఇంట్లో మిగిలిన నాలుగొందలూ తీసుకుని హాస్పిటల్ కెళ్ళింది. రాత్రి ఎనిమిది దాటడంతో డాక్టర్ యింటి కెళ్ళిపోయాడని వెనకే ఆయన ఇల్లని చెప్పగానే, వెళ్ళి ఈ డబ్బిచ్చెయ్యడం మంచిదని, మళ్ళీ యింటికి తీసుకెళ్తే మరే ఖర్చయినా వచ్చి అయిపోతుందనీ డాక్టర్ యింటికి వెళ్ళింది. బెల్ నొక్కగానే డాక్టరే స్వయంగా వచ్చి తలుపు తీసి ఆరతిని ఆశ్చర్యంగా చూస్తూ "రండి, రండి" అంటూ ఆహ్వానించాడు. లోపలికి వెళ్ళిన ఆరతి కొంచెం కంగారుపడి వెనక్కి రెండడుగులు వేసింది. బల్లమీద విస్కీ సీసా, సోడాసీసాలు, సగం తాగిన విస్కీగ్లాసు చూడగానే తను ఇంటికి ఆవేళప్పుడు రావడం మంచిది కాదని తెలుసుకుంది. తడబడుతూ "మీకు బిల్లెంత యివ్వాలో చెప్తే నేను యిచ్చేసి వెళ్తాను" అంది.

"కూర్చోండి చెప్తాను" అంటూ మళ్ళీ గ్లాసు అందుకున్నాడు.

"సారీ మిమ్మల్నీవేళప్పుడు డిస్టర్బ్ చేశాను. డబ్బెంతో చెప్తే" అన్న మాటల్ని పూర్తి చెయ్యకుండానే "రూమ్ అద్దెతో సహా తొమ్మిది వందలు" అన్నాడు. వెర్రిదానిలా చేతిలోవున్న నాలుగొందలు వైపూ చూసి "డాక్టర్‌గారూ ప్రస్తుతానికి ఈ నాలుగొందలూ తీసుకోండి మిగిలింది నెమ్మదిగా ఇచ్చేస్తాను" అన్న ఆమె మాటలకి విరగబడి నవ్వుతూ "ఇదేమన్నా పప్పుల దుకాణమా? బాకీలెట్టడానికి, నేను హాస్పిటల్ అద్దె చెల్లించి జీతాలివ్వాలా?" అన్నాడు వెటకారంగా. "కాదు డాక్టర్ మాది చాలా పేద కుటుంబం. ఒకేసారి అంతా యిచ్చుకోలేమండీ! నెమ్మదిగా యిచ్చేస్తాను" అంది ప్రాధేయపడుతూ. "అలాంటప్పుడు ధర్మాసుపత్రికి వెళ్ళలేక పోయావా మాలాంటి వాళ్ళ దగ్గరకెందుకొచ్చావ్" అన్నాడు.

"ఆపద సమయంలో ఏం తోచక, దాని ప్రాణం కొట్టుకుంటోంటే పురుడోసిన డాక్టర్ మీ దగ్గరికి తీసుకెళ్ళమంటే తీసుకొచ్చాను" అంది. "అయితే ఓ పని చెయ్యి, ఈ నాలుగొందలూ తీసుకుంటాను యిలాతే" అంటూ ఆరతిచ్చిన డబ్బుతోపాటు ఆమె చేతిని అందుకుని దగ్గరికి లాక్కొని, "ఈ ఒక్క రాత్రీ నాతో గడుపు మిగతా డబ్బు ఇవ్వక్కరలేదు. మీ చెల్లెలి దగ్గర నిన్ను చూసినప్పుడల్లా నా మనసు స్వాధీనం తప్పిపోయేది. ఈ రోజు నీలాంటి రంభ నా అదృష్టవశాత్తూ నా యింటికే రావడం కన్నా కావలసిందేమిటి? నా కోరిక తీర్చి కావాలంటే ఈ డబ్బుకూడా తీసుకెళ్ళిపో. ఈ డబ్బు నాకు రెండు రోజుల విస్కీ ఖరీదు చెయ్యదు." అంటూ ఆమెని బాహువుల్లో బంధించి పడక గది పైపుకి లాక్కెళ్ళసాగాడు.

**(మిగతా వచ్చే సంచికలో)**